కథ

చిన్నప్పుడు అమ్మకొట్టడం ఎంత సహజమో యవ్వనంలో ప్రేమ పుట్టడం, మనిషిని కుట్టడం అంతే సహజమనుకుంటాను! మనిషికి దేవుడు రెండు గొప్ప సంపదలిచ్చాడు. ఒకటి మెదడు, రెండోది హృదయం. కానీ ఈ రెంటికీ మధ్య మనిషికే అర్థం కాని ఓ సూక్ష్మమైన లింక్ పెట్టాడు.

# ప్రేమకోసం

ఈ రెండూ మనిషిని క్షణం కూడా ప్రశాంతంగా ఉండనివ్వవు. ఒకటి ఓ వైపు లాగితే, ఇంకోటి మరోవైపు లాగుతుంది. మెదడు ఔనంటే హృదయం కాదంటుంది. హృదయం ఔనంటే మెదడు వద్దంటుంది. ఒకటి రీజన్‌ని నమ్మితే, ఇంకోటి ఎమోషన్‌ని నమ్ముతుంది. ఈ రెండూ ఒకదానితో ఒకటి తలపడ్డప్పుడు మనిషి అయోమయంలో పడతాడు. ఆ గజిబిజిలో మనిషి సతమతమవుతూ ఉంటే దేవుడు చిలిపిగా నవ్వుకుంటాడేమో!

ఈ ఉపోద్ఘాతానికి కారణం.. నా మెదడూ, హృదయం రెండూ నా వశం తప్పి ప్రవర్తిస్తున్నాయి. నా మెదడు కళ్లెం తెగిన గుర్రంలా దౌడు తీస్తోంది ఆలోచనలతో. ఇక నా హృదయం...క్షణానికో తీరుగా మారుతోంది అనుభూతులతో. ఎంత ప్రయత్నించినా అవి అదుపులోకి రావడంలేదు. ''నిన్ను నీవు గెలిస్తే ప్రపంచాన్ని గెలిచినట్లే'' అన్న తత్త్వవేత్తల మాటలకు అర్థం ఇప్పుడిప్పుడే కొద్దికొద్దిగా తెలుస్తోంది. కల్లు తాగిన కోతిలాంటి మనసును కంట్రోల్ చేసుకోవడం మామూలా మరి!

సింపుల్‌గా అసలు విషయానికొస్తాను. నేనో అమ్మాయిని ప్రేమిస్తున్నాను. పేరు సౌమ్య. ఓ మోస్తరు అందగత్తె. ముఖం కళగా ఉంటుంది. నవ్వితే అద్భుతంగా ఉంటుంది. ఆ నవ్వంటే నాకెంతిష్టమో! తను నన్ను ప్రేమిస్తోందా అంటే...ఖచ్చితంగా ఔనని చెప్పలేను. ఇద్దరం చాలా స్నేహంగా ఉంటాం. ఏ అరమరికలు లేకుండా అన్ని విషయాలు మాట్లాడుకుంటాం.

తనకీ నేనంటే ఇష్టమే అనుకుంటాను. అయినా నా ప్రేమను వ్యక్తపరచాలంటే గుబులుగుబులుగానే ఉంది. నా ప్రేమను తెలిపేదెలా? తన హృదయంలో స్థానం పొందేదెలా? నా బుర్ర వేడెక్కేదీ, హృదయం శృతి తప్పేదీ ఈ ఆలోచనతోనే.

నా టెన్షన్‌ని చూసి నా ఫ్రెండ్ కతనంటాడు- ''అరే...అంత టెన్షనెందుకురా? టేకిటీజీ యార్'' అని. కానీ నేను స్థిమితంగా ఉండలేను. ఏం చేయను? నా మనస్తత్వమే అంత.

రెండు వారాల క్రితం తను నార్త్ ఇండియా టూర్ వెళ్లింది. మూడు రోజుల క్రితమే తిరిగొచ్చింది. రాగానే తనే వచ్చి కలిసింది.

''ఎలా జరిగింది టూర్?'' అడిగాను.

''చాలా బాగా జరిగింది. చాలా ఎంజాయ్ చేశాను'' అంది ఉత్సాహంగా.

''టూర్ విశేషాలేమిటి? ఏ ఏ ప్రదేశాలు చూశావు?''

''చూడవలసిన ప్రదేశాలన్నీ చూశాను. కానీ అన్నింటికన్నా నాకొకటి బాగా నచ్చింది. అదేమిటో గెస్ చేయి చూద్దాం'' అంది చిలిపిగా చూస్తూ.

ఏం గెస్ చేయాలో నాకు వెంటనే తోచలేదు. ఆమెను చూస్తూ, ఆమెతో మాట్లాడుతున్నాననే ఆనందమే నాలో నిండి ఉంది.

తల అడ్డంగా ఆడిస్తూ, ''ఊ..హు ...నా వల్ల కాదు. అదేంటో నువ్వే చెప్పు'' అన్నాను.

''ఆమాత్రం కూడా గెస్ చేయలేవా? ఒకసారి ట్రై చేసి చూడు'' అంది అదే చిలిపితనంతో.

''చెప్పానుగా నువ్వే చెప్పు'' ఆమెనే చూస్తూ అన్నాను.

ప్రశాంతంగా నవ్వి, 'తాజ్‌మహల్' అంది.

అది వినగానే నాలో చిన్న ప్రేమ ప్రకంపన. సాగరంలో ఓ కెరటం ఉవ్వెత్తున లేచి సద్దుమణిగినట్లు ఓ ప్రేమభావన నా మదిలో కదిలి మాయమైంది.

''వెన్నెలలో తాజ్‌మహల్‌ని చూడడం...ఓహ్ ...ఆ అనుభూతి...రియల్లీ వండర్‌ఫుల్. ఆ ప్రేమ చిహ్నం దగ్గర నా మనసు కూడా మధురంగా మారినట్లు ఫీలయ్యాను. ఓ తీయని ప్రేమానుభూతికి లోనయ్యాను'' పరవశానికి లోనవుతున్నట్లు అంది.

''ప్రేమ పైన నీకు చాలా గొప్ప భావన ఉన్నట్టుంది. అందుకే నీకు తాజ్‌మహల్ మాత్రమే బాగా నచ్చింది'' ఏమంటుందోనని ఆమె వైపు చూస్తూ అన్నాను.

''ప్రేమను గురించి ఆలోచించని మనిషెవరైనా ఉంటారా? ఎవరి విషయమో ఎందుకు... నీ విషయమే చెప్పు. నువ్వు ఎవరి ప్రేమనూ కోరుకోవడం లేదా? ప్రేమ పైన నీకు సదభిప్రాయం లేదా?''

''ఉంది. కానీ ప్రేమించిన ప్రతీ మనిషికీ తిరిగి ఆ ప్రేమ లభిస్తుందంటావా?''

''అది తరువాతి సంగతి. ముందు మనసుకు ప్రేమించే గుణం ఉండాలి. మనస్ఫూర్తిగా ప్రేమించగలగాలి''

''షాజహాన్ చక్రవర్తి కాబట్టి తన ప్రేమకు చిహ్నంగా తాజ్‌మహల్ కట్టించాడు. ఓ సగటు మనిషి తన ప్రేమను తెలుపుకోవడానికి అలా చేయలేడు కదా?''

''నిజమే. ప్రేమించే ప్రతీ మనిషి తాజ్‌మహల్ కట్టించలేడు. కానీ తను ప్రేమిస్తున్న విషయం చెప్పడానికి ఓ చిరునవ్వు చాలు. ఓ గులాబీ చాలు.''

''కేవలం ఒ గులాబీ, ఓ చిరునవ్వు, నిన్ను నేను ప్రేమిస్తున్నాను అనే మాటలు ఎదుటి మనిషిని సంతృప్తి పరచగలవా?''

''ఆ మనిషి కూడా ప్రేమిస్తున్నది నిజమైతే తప్పకుండా తృప్తి అనేది లభిస్తుంది. ఒకరినొకరు మనస్ఫూర్తిగా కావాలనుకోవడం కన్నా గొప్ప ఆనందం ఏముంటుంది?''

''అయితే నీ దృష్టిలో ప్రేమ గొప్పది. అవునా?''

''అవును.''

''అలా అయితే పెద్దలు కుదిర్చిన వివాహం కంటే ప్రేమ వివాహమే గొప్పదంటావు''

''ఊ..హూ...ప్రేమ వివాహమే గొప్పదని నేననడంలేదు. పెద్దలు కుదిర్చినదైనా ప్రేమ వివాహమైనా ఆ జంటకు ఒకరిపట్ల ఒకరికి పరిపూర్ణమైన నమ్మకం ఉండాలి. ఒకరికోసం ఒకరన్నట్లుగా ప్రేమను పంచుకుంటూ ఉండగలగాలి. అప్పుడే ఆ వివాహం సక్సెస్ అవుతుంది. ఇద్దరి మధ్య ప్రేమ బంధం గట్టిగా ఉండాలి. అదే ముఖ్యం''

''ఇంత డీప్‌గా ఆలోచిస్తున్నావు. నువ్వు ప్రేమ వివాహం చేసుకోవాలనుకుంటున్నావా?''

అంతవరకూ గలగలా మాట్లాడిన ఆమె మౌనంగా ఉండిపోయింది. నా వైపు అదోలా చూసింది. ఆ భావం నాకు స్పష్టంగా అర్థం కాలేదు.

''ఏమిటి ఆలోచిస్తున్నావు? అడిగిన దానికి సమాధానం చెప్పనే లేదు.'' మళ్లీ అడిగాను.

''ఏం చెప్పను? దాని గురించి నేనెప్పుడూ ఆలోచించలేదు'' అంది దీర్ఘంగా ఆలోచిస్తూ.

మళ్లీ తనే మాట్లాడుతూ- ''అయినా హఠా

...త్తుగా నీకెందుకా సందేహం వచ్చింది? ఈ విషయం గురించి నువ్వేం ఆలోచిస్తున్నావు?'' అడిగింది.

చెప్పాలా వద్దా అని కాస్త సందేహించాను. ఎందుకో చెప్పాలనిపించింది.

''నేను ప్రేమించిన అమ్మాయినే చేసుకోవాలనుకుంటున్నాను'' చెప్పాను.

''ఆహా...అయితే దొరగారు ప్రేమలో పడ్డారన్నమాట. ఎవరో ఆ అదృష్టవంతురాలు?'' అంది నవ్వుతూ.

''అదృష్టవంతురాలు ఆఅమ్మాయి కాదు. నా ప్రేమను తను అవునంటే నేనే అదృష్టవంతుణ్ణి.''

''అంటే నీది వన్‌వే లవ్వన్నమాట. ఇంతకీ ఆ అమ్మాయి ఎవరో, ఏమిటో చెప్పనేలేదు''


''ఊ..హూ... ఇప్పుడు కాదులే. తరువాత చెబుతాను.''

''సరే నీ ఇష్టం. ఇదిగో నీ కోసం ఈ చిన్నగిఫ్ట్'' అంటూ ఓ ప్యాకెట్ నా చేతిలో పెట్టింది.

''ఏమిటిది?'' ఆశ్చర్యంగా అడిగాను.

''నేను వెళ్లాక నువ్వే చూసి తెలుసుకో. ఇక నేనెళ్తాను'' అంటూ వెళ్లిపోయింది.

ఆమె వెళ్ళినవైపే కాసేపు చూస్తూ ఉండిపోయాను. తరువాత తను ఇచ్చిన ప్యాకెట్ విప్పి చూశాను. 'గ్రేట్ లవ్ స్టోరీస్' పుస్తకం. మరింత ఆశ్చర్యపోయాను. ఈ పుస్తకం నాకివ్వడంలో ఆంతర్యమేమిటా అని ఆలోచనలో పడ్డాను. ఒక వేళ తను తన మనసులోని మాటను ఇలా ఇండైరెక్టుగా చెప్పిందా అని అనిపించింది.



అయోమయంలో ఎటూ తేల్చుకోలేకపోయాను.

★★★

వారం రోజులు నా మనసులోని మాటను సౌమ్యకు ఎలా చెప్పాలా అని మథనపడుతూ గడిపాను. ఆ ఆలోచనలతోనే సాయంత్రం రూము కొచ్చాను. ఆఫీసులో పని రొటీన్‌గా చేస్తున్నాను. చాలా బోర్ కొడుతోంది. మునుపటి ఉత్సాహం లేదు. ఛేంజ్ కోసం సెకెండ్‌షో ఏదైనా కామెడీ సినిమాకి వెళ్లాలనుకున్నాను. రెడీ అయి బయలుదేరుతుండగా ఇంటి ఓనర్ వచ్చాడు. ఏమిటన్నట్లు అతని వైపు చూశాను. నాకో ఉత్తరం వచ్చిందని, అది నా చేతిలో పెట్టి వెళ్లిపోయాడు. ఊరి నుంచి అమ్మానాన్నలు వ్రాసిన ఉత్తరమది. విప్పి చూశాను. అందులోని ముఖ్య విషయం నా పెళ్లి ప్రస్తావన. ఏదో సంబంధం చూశారట, అమ్మాయి కూడా సిటీలోనే ఉంటుందట. పెళ్లి చూపులకి వెళ్ళాలని, దానికోసం త్వరలోనే వాళ్లు కూడా సిటీకొస్తున్నారని వ్రాశారు.

ఉత్తరం చదవగానే నాలో నిరాశ మరింత పెరిగింది. సౌమ్య నాకు శాశ్వతంగా దూరం కాదు కదా అనే ఆలోచన ఒక్క క్షణం భయపెట్టింది. ఈ పెళ్లి చూపులకు వెళ్లడం నాకిష్టంలేదని చెబితే వాళ్లు వేయిరకాల ఆరాలు తీస్తూ నా ప్రాణం తోడేస్తారు. నేనో అమ్మాయిని ప్రేమించాను, ఆమెనే చేసుకుంటానంటే వాళ్లు అగ్గిమీద గుగ్గిలం కావడం ఖాయం. ఈ విపత్తు నుంచి ఎలా బయటపడాలా అని ఆలోచిస్తూ కాసేపు రోడ్డుపై కాలక్షేపం చేశాను. తరువాత మెస్‌లో భోజనం చేసి ఏ సినిమాకి వెళదామా అనే డైలమాలో కొట్టుమిట్టాడుతూ రోడ్డుమీదకొచ్చి నిలబడ్డాను. వెనుక నుంచి నా భుజంపై ఎవరో చేయి వేశారు. వెనక్కి తిరిగి చూశాను. అతని పేరేమిటో నాకు తెలియదు. పెళ్లి సంబంధాలు కుదుర్చుతుంటాడు. సంబంధం కుదిరితే మూడువేల నుంచి అయిదువేల రూపాయల వరకు కమిషన్ తీసుకుంటాడట. ఇది అతని పార్ట్‌టైం జాబ్. ఏదో ప్రైవేట్ కంపెనీలో సేల్స్ రిప్రజెంటెటివ్‌గా చేస్తున్నాడట. ఎప్పుడూ ఏదో ఊరు తిరుగుతూనే ఉంటాడు. మా ఊళ్ళో మాకు తెలిసినవాళ్ళకు చాలా దగ్గరి బంధువట. క్రితం సారి అమ్మానాన్న వచ్చినపుడు ఇతణ్ణి కలిసి నాకో సంబంధం చూసి పెట్టమని ఇతనికి పురమా

కె. సురేందర్‌రావు

యించారు. అప్పుడే ఈ పెళ్ళిళ్ళ పేరయ్యతో నాకు పరిచయమయ్యింది.

''ఏమిటోయ్ బాగున్నావా?'' అంటూ ప్రశ్నించాడు.

''ఆ బాగానే ఉన్నాను'' అన్నాను పొడిగా.

''ఊ... భలే అదృష్టవంతుడవోయ్ నువ్వు. లక్కీఛాన్స్ కొట్టేశావు'' అన్నాడు మిస్టీరియస్‌గా. ఏమీ అర్థంకాలేదు నాకు ''మీరు దేని గురించి మాట్లాడుతున్నారు'' అడిగాను.

''అదేమిటోయ్, నీకింకా విషయం తెలియదా? తెలుసనుకున్నానే..? అప్పుడే నీ ముఖంలో పెళ్లి కళ వచ్చేసింది'' అన్నాడు అసలు విషయం చెప్పకుండా.

''మీరేం మాట్లాడుతున్నారో నాకు అర్థం కావడం లేదు. కాస్త అర్థమయ్యేటట్లు చెబుతారా?'' అసహనంగా అడిగాను.

''నీకో సంబంధం చూడమని మీ అమ్మానాన్నా నాకు చెప్పారుగా. చూశాను. పదిరోజుల క్రితం మీ ఊరెళ్ళాను. మీ అమ్మానాన్నలను కలిశాను. వాళ్ళకు కూడా ఈ సంబంధం బాగా నచ్చింది. ఇక అమ్మాయి తరపువాళ్లకు ఈ సంబంధం పూర్తిగా నచ్చింది. నీ గురించి వాళ్ల అన్ని ఎంక్వయిరీలు చేసుకున్నారు. నువ్వు అమ్మాయిని చూసి ఓకే అన్నావంటే ముహుర్తాలు పెట్టుకోవచ్చు'' అసలు విషయం చెప్పాడు.

అక్కడే ఆ పెళ్లిళ్ల పేరయ్య పీక నులిమేయాలన్నంత కోపం వచ్చింది. నా ప్రేమకు అడ్డుపడే సైంధవుడిగా కనిపించాడు మరి! కానీ నన్ను నేను కంట్రోల్ చేసుకున్నాను. నా పెళ్లి గురించి నాకు తెలియకుండా నా వెనుక ఇంత తతంగం జరుగుతుందని నేనసలు ఊహించనే లేదు. అమ్మాయి పేరూ, ఊరూ ఏమిటో అడిగి తెలుసుకుందామని ఒక్క క్షణం అనిపించింది. ఎలాగూ ఈ సంబంధాన్ని నేను కాదంటాను. సౌమ్యను తప్ప మరో అమ్మాయిని పెళ్లి చేసుకునే ఉద్దేశం నాకు లేదు. అలాంటప్పుడు అనవసరమైన ఆరాలు తీయడం దేనికని నోరు మూసుకున్నాను.

''ఏమిటోయ్, పెళ్ళి మాట వినగానే అలా బిగుసుకుపోయావు? ఒకటి రెండు రోజుల్లో మనం పెళ్ళి చూపులకెళ్ళాలి. రెడీగా ఉండు. వస్తా'' అంటూ హడావిడిగా వెళ్లిపోయాడు పెళ్లిళ్ళ పేరయ్య.

ఈ పెళ్లిళ్ల పేరయ్య అమ్మానాన్నలతో కలిసి నా కొంప ముంచక ముందే సౌమ్యను కలిసి ఆమెకు నా మనసులో మాట చెప్పేయాలని నిర్ణయించుకున్నాను. తరువాత ఇద్దరం కలిసి ఈ సమస్య నుంచి బయటపడే మార్గం ఆలోచిస్తే బాగుంటుందనిపించింది. ఇలా అనుకోగానే నాలో ఓ రకమైన హుషారు కలిగింది. సినిమాకెళ్లాలనే సంగతి మరచిపోయాను. అప్రయత్నంగానే విజిల్ వేసుకుంటూ నా రూమ్ వైపు అడుగులేశాను.

★★★

మధ్యాహ్నం లంచ్‌టైంలో సౌమ్య పనిచేసే ఆఫీసుకు ఫోన్ చేశాను. తను ఆఫీసుకి రాలేదు. వారం రోజులు లీవ్‌లో ఉందని చెప్పారు. ఏం చేయాలో తోచలేదు. సరాసరి సౌమ్య ఇంటికే వెళ్ళి కలిస్తే ఎలా ఉంటుందని ఆలోచించాను. ఎందుకో ఆ ఆలోచన నచ్చలేదు. సౌమ్య తనుగా వచ్చి నన్ను కలిస్తే తప్ప తనని కలుసుకునే దారిలేదు. ఈలోగా బలవంతంగానైనా అమ్మానాన్నలు నన్ను పెళ్లి చూపులకు లాక్కెళతారు. తప్పించుకునే మార్గం కనిపించలేదు. నాలో ఒకటే టెన్షన్. క్షణక్షణానికి అది పెరగసాగింది.

సాయంత్రం రూముకొచ్చేసరికి అమ్మానాన్న వచ్చి ఉన్నారు. నెత్తిన పిడుగు పడ్డట్టయ్యింది. నా చుట్టూ ఉచ్చు బిగుసుకుంటున్న అనుభూతి కలిగింది.

కుశల ప్రశ్నలు పూర్తయ్యాక ''రేపు మధ్యాహ్నం నుంచి ఆఫీసుకు లీవ్ పెట్టు. తొందరగా వచ్చేయి. రేపు సాయంత్రం పెళ్లి చూపులకెళ్లాలి.'' ఆజ్ఞాపిస్తున్నట్లుగా అన్నారు నాన్న.

నేనేమీ సమాధానం చెప్పలేదు. ఏం మాట్లాడాలో తోచలేదు.


''ఏరా? మాట్లాడవే?'' అసహనంగా గద్దించారు నాన్న.

ఇక లాభం లేదని, ''ఇప్పుడే పెళ్ళి చేసుకునే ఆలోచన లేదు నాన్నా'' అన్నాను మెల్లగా.

అమ్మా నాన్న ఇద్దరూ నమ్మలేనట్లు నావైపు చూశారు.

''ఎందుకురా? నీకేం తక్కువని. మంచి ఉద్యోగం ఉంది. ఏ బాదరబందీ లేదు. నువ్వు ఒక ఇంటి వాడివైతే మాకు తృప్తిగా ఉంటుంది. మా బాధ్యత కూడా తీరినట్లుంటుంది'' అనునయంగా అంది అమ్మ.

''నాకిష్టం లేదమ్మా. అంతే. నన్ను బలవంతపెట్టకండి'' అన్నాను.




''ఏరా? ఎవ్వరినైనా ప్రేమించావా? ఈ ప్రేమా దోమా అంటూ నువ్వు పిచ్చివేషాలు వేస్తే ఊరుకునేది లేదు'' కోప్పడ్డారు నాన్న.

ఏమైనా సరే సౌమ్యను నేను ప్రేమించిన సంగతి చెప్పేయాలనుకున్నాను. కానీ నాన్న మరింత ఉగ్రుడైపోతారు. మొండిపట్టుదలతో పసేమిరా అంటారు. సమస్య మరింత జటిలమవుతుంది. నాకు మనశ్శాంతి లేకుండా పోతుంది. అందుకే తరువాత మెల్లగా వారికి నచ్చజెప్పవచ్చని ఊరుకున్నాను.

''ఇదిగో ఇప్పుడే చెబుతున్నాను. రేపు మనం పెళ్లిచూపులకు వస్తున్నట్లు వారికి కబురు పెట్టాను. మనం వెళుతున్నాం. అంతే. నువ్వు కాదూ కూడదు అన్నావో..ఇక నీ ఇష్టం'' వార్నింగ్ ఇచ్చారు నాన్న.

నేనేమీ మాట్లాడలేదు. మౌనంగా ఉండిపోయాను.

''అమ్మాయి చాలా బాగుంటుందిరా. వాళ్లు ఫొటో పంపించారు. ఇదుగో చూడు'' అంటూ నా చేతికి ఓ ఫొటో ఇవ్వబోయింది అమ్మ.

''వద్దులే. రేపు ఎలాగూ అమ్మాయిని చూస్తానుగా. కానీ ఒక్క విషయం. అమ్మాయి అన్ని విధాలా నాకు నచ్చితేనే నేను పెళ్ళికి ఒప్పుకుంటాను. లేకపోతే లేదు'' ఖచ్చితంగా చెప్పాను.

ఏమనుకున్నారో ఏమో అమ్మా నాన్నా కూడా సరేనన్నారు. ఏదో ఒక నెపంతో ఈ సంబంధాన్ని కాన్సిల్ చేయవచ్చనే కాన్ఫిడెన్స్ నాలో కలిగి సంతోషమనిపించింది. ఇలా వీళ్లు మరో సంబంధం చూసి నన్ను ఇరుకున పెట్టకముందే సౌమ్యతో అన్ని విషయాలు మాట్లాడాలని నిర్ణయించుకున్నాను.

★★★

పెళ్లి చూపుల తతంగం మొదలయ్యింది. అందరూ హాల్లో కూర్చొని ఉన్నాం. ముఖంలో ఏ భావమూ లేకుండా ఉన్నాను నేను. చుట్టూ ఉన్న వారు హాస్యోక్తులూ, ఛలోక్తులూ విసురుకుంటూ నవ్వుకుంటున్నారు. నేను ఇబ్బందిగా ఫీలవ్వసాగాను.

ఇంతలో అమ్మాయిని తీసుకొచ్చి మా ముందు కూర్చోబెట్టారు. నేను అమ్మాయిని చూడలేదు. పెద్దగా పట్టించుకోనూలేదు. ఏదో ఒక రకంగా సంబంధాన్ని కాన్సిల్ చేసుకునేవాణ్ణి నాకెందుకుంటుంది ఆరాటం? కానీ ఓ చిన్న గిల్టీ ఫీలింగ్ నాలో కలిగింది. ఓ అమ్మాయిని చూసి ఏదో ఒక మిషతో నచ్చలేదని చెప్పడం దారుణమనిపించింది. కానీ తప్పనిసరి పరిస్థితుల్లో పెళ్లిచూపులకి రాక తప్పలేదు.

చుట్టూ ఉన్నవారు అమ్మాయిని 'చూడు చూడు' అని గోల చేయడంతో తలెత్తి చూశాను. నా కళ్లను నేనే నమ్మలేక పోయాను. ఎదురుగా సౌమ్య. ముగ్ధ మనోహరంగా కూర్చొని ఉంది. ఆనందం, ఆశ్చర్యం ఒకేసారి కలిగాయి. అదృష్టం అనుకోని విధంగా నన్ను వరించినట్లనిపించింది.

నెలరోజుల వ్యవధిలో మా పెళ్ళి జరిగిపోయింది.

తొలిరాత్రి సిగ్గులపూబంతిలా గదిలోకి వచ్చింది సౌమ్య. తలుపు గడియవేశాను. ఇద్దరం మంచంపై కూర్చున్నాం.

''సౌమ్యా! మన పెళ్లి జరగడం ఇంకా నాకు కలలాగే అనిపిస్తోంది'' అన్నాను తననే ఆరాధనగా చూస్తూ.

''ఇది కల కాదు నిజం'' మెల్లగా అంది సౌమ్య.

''నీకో విషయం తెలుసా! మన పెళ్లి కుదిర్చిన పెళ్ళిళ్ల పేరయ్యకి నేను థాంక్స్ చెప్పినప్పుడు అభినందించాల్సింది తనని కాదు మరో వ్యక్తినని చెప్పాడు. ఆ వ్యక్తి ఎవరోగాని తలెత్తి మొక్కాలనిపిస్తోంది'' ఆనందంగా అన్నాను.

''ఆ వ్యక్తిని నువ్వు మొక్కకూడదు. జీవితాంతం మనసారా ప్రేమించాలి'' చిన్నగా నవ్వుతూ అంది సౌమ్య.

''వ్వా..ట్? నువ్వా...?'' షాక్ తిన్నాను నేను.

సౌమ్య ప్రేమగా నావైపు చూస్తూ ''ఔను. నేనే. మా ఇంట్లో మా అమ్మానాన్నలు ప్రేమపెళ్లికి చచ్చినా ఒప్పుకోరు. ప్రేమించి పెళ్ళి చేసుకున్న మా అక్కని వాళ్లు ఇప్పటికీ దోషిలాగే చూస్తున్నారు. నా పరిస్థితి కూడా అలా కాకూడదనుకున్నాను'' అంది.

''నాకేమీ అర్థం కాలేదు. కాస్త వివరంగా చెప్పు'' అయోమయం నుంచి తేరుకోవడానికి ప్రయత్నిస్తూ అడిగాను.

''నువ్వు నన్ను ప్రేమిస్తున్నావనే సంగతి నాకు తెలుసు. నువ్వంటే కూడా నాకు చాలా ఇష్టం. ఏనాడూ నువ్వు నీ మనసులో మాట చెప్పలేదు. చాలా సార్లు నేను ఇండైరెక్టుగా చెప్పినా నువ్వు పట్టించుకోలేదు'' నా వైపు ఉద్రేకంగా చూస్తూ అంది.

నేను ఇంకా ఏం చెబుతుందోనని ఆమె వైపే మౌనంగా చూస్తూ ఉండిపోయాను.

మళ్లీ చెప్పడం మొదలుపెట్టింది సౌమ్య.

''మా అక్కా బావా పెద్దలనెదిరించి పెళ్లి చేసుకున్నారు. ఇప్పుడు వాళ్లకు పెద్దవాళ్ల సపోర్ట్ ఏమాత్రం లేదు. నా విషయంలో అలా జరగకూడదనుకున్నాను''

''ప్రేమించడం, పెళ్లి చేసుకోవడం తప్పు కాదుగా. పెద్దవాళ్ళ సపోర్ట్ లేకపోతే ఏమయ్యింది? స్నేహితులూ, శ్రేయోభిలాషులు ఎంతో మంది ఉంటారు. ఇప్పుడు మీ అక్కాబావా హ్యాపీగా లేరంటావా?'' ఆమె చెబుతున్నదానికి మా పెళ్లికి సంబంధం ఏమిటో అర్థంగాక అడిగాను.

''ఇప్పుడు వాళ్ళు హ్యాపీగానే ఉన్నారు. కానీ పెద్దవాళ్ల సపోర్ట్ లేనిలోటు లోటుగానే ఉంది. జీవితంలో చాలా సందర్భాల్లో సామాజికంగా, మానసికంగా, ఎమోషనల్‌గా పెద్దవాళ్ల సపోర్ట్ మనకు చాలా అవసరం. అది లేకపోతే మనం ఎన్ని రకాలుగా ఇబ్బంది పడతామో, కష్టపడతామో మా అక్కా, బావలను చూసే తెలుసుకున్నాను. అలాంటి పరిస్థితి మనకు రాకూడదనుకున్నాను'' ఉద్వేగంగా అంది.

''నువు చెబుతున్నదానికి మన పెళ్లికి సంబంధం ఏమిటి? కాస్త అర్థమయ్యేటట్లు చెప్పు'' అడిగాను.

''నాకు చిన్నప్పటి నుంచి కూడా మా పిన్ని బాబాయ్‌ల పట్ల ఎటాచ్‌మెంట్ ఎక్కువ. స్కూలుకు ఎప్పుడు సెలవులొచ్చినా వెళ్లి వాళ్లతోనే గడిపేదాన్ని. ఇంట్లో నాకు పెళ్ళి సంబంధాలు చూడడం మొదలుపెట్టగానే నాలో ఏదో దిగులు మొదలయ్యింది. నీకు శాశ్వతంగా దూరం అవ్వాల్సి వస్తుందేమోనన్న భయం . ఏం చేయాలో తోచలేదు. అందుకే ఆఫీసుకు లీవ్‌పెట్టి మా పిన్ని బాబాయ్‌ల దగ్గరికెళ్ళాను. నీ గురించే ఆలోచిస్తూ నేను దిగులుగా ఉండడం మా పిన్ని గమనించి అడిగింది. నీ గురించి చెప్పాను. ఆమె మా బాబాయ్‌తో మాట్లాడింది. మా బాబాయ్ నాతో మాట్లాడి నీ వివరాలు తీసుకున్నాడు. తానే స్వయంగా నీ గురించి ఎంక్వయిరీ చేసి తెలుసుకున్నారు. నా సెలెక్షన్ చాలా బాగుందని మెచ్చుకున్నారు. పెళ్లిళ్ల పేరయ్య సేల్స్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్న కంపెనీకి మా బాబాయ్ రీజినల్ మేనేజర్. ఆయన పెళ్లిళ్ల పేరయ్యను పట్టుకుని మనిద్దరికీ ఎలాగైనా సంబంధం కుదిరేలా చూడమని చెప్పారు. అప్పటికే అతని దగ్గర నీ వివరాలు, ఫొటో వున్నాయి. ఆయన సరేనన్నాడు. మా అమ్మా నాన్నలతో ఈ సంబంధం తనే చూసినట్టుగా మాట్లాడి ఒప్పించాడు. బాబాయ్ నీ వివరాలు తెలుసుకుని, నీ ఫొటో చూశాక అమ్మానాన్నలు కూడా ఒప్పుకున్నారు. ఆ తరువాత నువు పెళ్లి చూపులకు రావడం, మన పెళ్లి జరగడం – ఇదీ తెరవెనుక జరిగిన కథ'' చెప్పడం ముగించింది సౌమ్య.

''నువు చాలా కూల్‌గా ఉంటావని తెలుసు. కానీ ఇంత స్మార్ట్‌గా కూడా ఆలోచిస్తావని ఇప్పుడే తెలిసింది'' కాంప్లిమెంట్ ఇచ్చాను.


సౌమ్య ఓ చిరునవ్వు చిందించింది. ఆమె కళ్లల్లో ఓ రకమైన మెరుపు కనిపించింది.

మళ్లీ నేనే మాట్లాడుతూ – ''మీ అమ్మా నాన్నలను మోసం చేశావనే గిల్టీఫీలింగ్ నీలో ఏమైనా కలిగిందా?'' అడిగాను.

నావైపు అదోలా చూసి, ''మొదట నేనూ అలా అనుకున్నాను. కానీ ఇప్పుడు నాలో ఏ గిల్టీ ఫీలింగ్ లేదు. అమ్మా నాన్నల చేతులమీదుగా మన పెళ్లి జరిగింది. వాళ్ల పెద్దరికం నిలబడింది. ఇటు మన ప్రేమ కూడా గెలిచింది. వాళ్ళు ఆనందంగా ఉన్నారు. మనమూ సంతోషంగా ఉన్నాం. ఇంత కన్నా ఏం కావాలి'' అంది.

నాకూ నిజమేననిపించింది. ఇలా కాకుండా మేం తిరగబడి ప్రేమించిన వ్యక్తినే చేసుకుంటాం అని ఉంటే వాళ్లు బలవంతంగానైనా మమ్మల్ని వేరు చేసేవాళ్లు. ప్రేమకోసం పెద్దలను ఎదిరిస్తున్నప్పుడు, పెళ్లి చేసుకుంటున్నప్పుడు చాలా థ్రిల్లింగ్‌గా, హ్యాపీగా ఉంటుంది. కానీ ఆపైన పరిణామాలెలా ఉంటాయనేది ఆలోచిస్తే అందరూ అలా చేయరేమో! కాస్త కష్టమైనా ఏదో ఒక రకంగా పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకుంటే అన్ని విధాలా బాగుంటుందని నాకూ అనిపించింది. రహస్య స్వయంవరం ద్వారా తనవాణ్ణి చేసుకున్న సౌమ్యపైన అమితమైన ప్రేమ కలిగింది.

ప్రేమగా సౌమ్యను దగ్గరకు తీసుకుంటూ–''నన్నే గెలుచుకున్న నీకు ఈ కౌగిలిహారాన్నే బహుమతిగా ఇస్తున్నాను. నన్నే నీకు సొంతం చేస్తున్నాను'' అన్నాను.




లతలా నన్ను పెనవేసుకుంది సౌమ్య. అమృతాల విందుకోసం కాంక్షగా మా పెదవులు ముడిపడ్డాయి. మల్లెలు మా శ్వాసలను పరిమళవంతం చేశాయి. మా మధ్యకు రావడానికి గాలికి చోటు లేక నిరాశగా వెనుదిరిగింది.

అనురాగ సంగమంలో మేము మమేకమవుతుండగా కాస్తున్న వెన్నెల్లో కురుస్తున్న మంచు మమ్మల్ని చల్లగా దీవించాయి.

★